ప్రజాశక్తి
సోమవారం 28 ఏప్రిల్, 2025
శ్రీకాకుళం



నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జెడ్పిలో సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినతులతో వస్తున్న వారు తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. వినతులపై నమోదు, నమోదైన తర్వాత వాటి స్థితి తెలుసుకోవాలంటే 1100 నంబరుకు నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెన్షనర్లపై చిన్నచూపు తగదు

- ఎపి విశ్రాంత ఎంప్లాయీస్ జెఎసి ఛైర్మన్ పురుషోత్తం నాయుడు
- జెఎసి ఆధ్వర్యాన 'పెన్షనర్ల ఐక్యత-నేటి అవసరం'పై సదస్సు



మాట్లాడుతున్న పురుషోత్తం నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సుదీర్ఘకాలం పాటు ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధులుగా పనిచేసి ప్రభుత్వంలో భాగస్వాములైన ఉద్యోగులు విశ్రాంత తర్వాత గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేందుకు అనువైన పరిస్థితి కల్పించాల్సి బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఎపి విశ్రాంత ఎంప్లాయీస్ జెఎసి ఛైర్మన్ సిహెచ్.పురుషోత్తం నాయుడు పేర్కొన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో జిల్లా పెన్షనర్ల ఐక్య వేదిక ఆధ్వర్యాన పెన్షనర్ల ఐక్యత-నేటి అవసరం అన్న అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎపి విశ్రాంత ఎంప్లాయీస్ అండ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు డి.పార్వతీశం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు పెన్షన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నారని, వారిపై ప్రభుత్వాలకు చిన్న చూపు తగదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పరిష్కరించి తక్షణమే కరువు భత్యం, ఇతర బకాయిలు చెల్లించాలని కోరారు. ఆల్ పెన్షనర్స్ అండ్ విశ్రాంత పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 70 లక్షల మంది ఇపిఎస్ పెన్షనర్లలో సగం మంది పెన్షన్ రూ.వెయ్యి లోపే వస్తోందన్నారు. వారికి కరువు భత్యం లేదన్నారు. జీవితాంతం అదే పెన్షన్ వస్తే వారికి ఆరోగ్య భద్రత ఎక్కుడుందని ప్రశ్నించారు. వృద్ధాప్యం కారణంగా ఎక్కువ మందికి మందుల ఖర్చులు పెరుగుతోందని, ఈ సమయంలో మందులు ఖర్చులకు సరిపడినంత పెన్షన్ రాక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యధిక శాతం పెన్షన్ రూ.5000 లోపు మాత్రమే వస్తుందన్నారు. కనీస పెన్షన్ నెలకు రూ.9 వేలు, కరువు భత్యం ఇవ్వాలన్నారు. ఎస్‌బిఐ ఆంధ్రా రీజినల్ సర్కిల్ ఉపాధ్యక్షులు సిహెచ్.బాపయ్య పంతులు మాట్లాడుతూ ఒపిఎస్ పెన్షనర్లను విభజిస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం ఒపిఎస్ పెన్షనర్లకు నష్టదాయకమని, అందువల్ల తక్షణమే ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి విశ్రాంత ఎంప్లాయీస్ యూనియన్ రీజినల్ కార్యదర్శి పి.వాసుదేవరావు మాట్లాడుతూ హయ్యర్ పెన్షన్ కోసం విశ్రాంత ఉద్యోగులు పోరాడుతున్నా వాటిని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. విశ్రాంత ఉద్యోగులు అనేక విధాలైన అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. సమస్యలను పరిష్కరించడానికి సరైన యంత్రాంగాన్ని ప్రభుత్వ నియమించాలన్నారు సుప్రీం కోర్టు హయ్యర్ పెన్షన్ తీర్పులో అందరికీ అమలు చేయాలని చెప్పినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సదస్సులో సిపిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.భాస్కరరావు మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంలో గ్యారంటీగా పెన్షన్ ఎంత వస్తుందో తెలియని అనిశ్చిత పరిస్థితి ఉందన్నారు. ప్రత్యామ్నాయంగా సూచించిన యుపిఎస్‌లో కనీస పెన్షన్ రూ.10 వస్తుందని చెబుతున్నా... అనేక పరిమితులు, లోపాలు ఉన్నాయన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులందరికీ ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. వివిధ పెన్షనర్ల సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇపిఎస్ పెన్షనర్లకు కనీసం రూ.9 వేలు కరువు భత్యం ఇవ్వాలని, హయ్యర్ పెన్షన్ అందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ యుపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానమే అమలు చేయాలన్నారు. పాత పెన్షన్ విధానంలో పెన్షన్ అప్డేషన్ చేపట్టాలన్నారు. పెన్షనర్లందరికీ మెడికల్ ఇన్సూరెన్స్ వైద్య సదుపాయాలు కల్పించి ఉచితంగా మందులు సరఫరా చేయాలన్నారు. సీనియర్ సిటిజన్లకు రైల్వే ఛార్జీలో రాయితీలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించుకునేందుకు సమిష్టి ఉద్యమాలకు ఆల్ ఫెన్షనర్సు అండ్ విశ్రాంత పర్సన్స్ అసోసియేషన్ నాయకులు ఎం.ఆదినారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఐక్యపోరాటాల ద్వారానే హక్కులను పరిష్కరించుకునేందుకు సిద్ధం కావాలన్నారు. ఈ సదస్సులో వివిఎస్ కేశవరావు (జ్యుడీషియల్), పి.సుధాకర్ (ఆంధ్రా బ్యాంకు), ఎం.ఆర్.ఎస్.ప్రకాశరావు (సోషల్ వెల్ఫేర్), కె.సోమసుందరరావు (మెడికల్ అండ్ హెల్త్), ఎస్.భాస్కరరావు (ఎడ్యుకేషన్), కె.చంద్రశేఖరరావు (పోస్టల్), ఎం.గోవర్ధనరావు (టెలికం), కె.శ్రీనివాసు (ఎల్ఐసి) తదితరులు నాయకత్వం వహించారు. ఇరిగేషన్, రెవెన్యూ, ఆర్అండ్‌బి, ఎస్‌సి కార్పొరేషన్, ఫారెస్టు, రైల్వే, పోలీస్, ఫైర్, పోస్టల్, డైరీ తదితర సంఘాల విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు.

20న అఖిలభారత సమ్మె

- స్ఫూర్తివంతంగా మేడే ఉత్సవాలు
- సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



మాట్లాడుతున్న తేజేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు మే 20న అఖిలభారత సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం సిఐటియు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడి నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాలు కోసం 4 లేబర్ కోడ్‌లుగా మార్చి వేసిందని అన్నారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి యాజమాన్యాల శ్రమ దోపిడీని మరింత పెంచుకోవడం కోసం, యజమానుల దోపిడీని, అక్రమ తొలగింపులను, పనిభారాన్ని ప్రశ్నించే పరిస్థితి లేకుండా చేయడం కోసం, పనిగంటలు పెంచడానికి లేబర్ కోడ్‌లు తెచ్చారని అన్నారు. యజమానులు కార్మిక చట్టాలు ఉల్లంఘించినా గతంలో లాగా జైలుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కొంత జరిమానా కడితే సరిపోతుందని చట్టాల్లో మార్పులు చేశారని తెలిపారు. యజమానులు చేసే నేరపూరిత చర్యలను నేరాలుగా పరిగణించకుండా కార్మికులు చేసే పోరాటాలను, యాజమానులను ప్రశ్నించినా నేరాలుగా పరిగణించేలా యజమానులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించేలా చట్టాలు మారుస్తున్నారని అన్నారు. పెట్టుబడిదారులకు ఉద్యోగులను, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేవిధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతూ కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తుందని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం ప్రజల త్యాగాలతో జాతి నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రయివేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారు. కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడాలన్నారు. కార్మికుల జీవన్మరణ సమస్య అని అన్నారు. ఒక వైపు కార్పొరేట్‌లు లాభాలు పెరిగాయని, కానీ, కార్మికుల నిజవేతనాలు దిగజారయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ సామాన్యులపై భారాలు వేస్తుందన్నారు. సమాజంలో మత వైషమ్యాలు పెంచి మత చీలికలు తెస్తుందని అన్నారు. ధరల పెరుగుదల, అవసరాలు దృష్టిలో పెట్టుకొని కార్మికుల కనీస వేతనం నెలకు రూ. 26 వేలు నిర్ణయించి అమలు చేయాలన్నారు. కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులను, స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలన్నారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన పథకం తదితర స్కీ వర్కర్స్‌కు కనీస వేతనాలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రపంచం కార్మిక దినోత్సవం మేడే స్ఫూర్తివంతగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. 8 గంటలు పని దినాన్ని 12 నుంచి 14 గంటలుగా మార్చాలని చూస్తున్నారని పేర్కొన్నారు. పోరాటాలతోనే హక్కులు సాధ్యమని ఐక్యపోరాటాలు నిర్వహించాలని అన్నారు. విద్యుత్ ప్రయివేటీకరణ ఆపాలని, విద్యుత్ భారాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు కె.నాగమణి, అల్లు మహాలక్ష్మి, ఎన్.గణపతి, ఎన్.వి.రమణ, కె.సూరయ్య, ఎం.ఆదినారాయణమూర్తి, హెచ్.ఈశ్వరరావు, బి.ఉత్తర, ఆర్.ప్రకాశరావు, పి.లతాదేవి, పి.గోపి, ఆర్.సురేష్‌బాబు, త్రినాథ్, సుశీల, ధనలక్ష్మి పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పురుషోత్తం నాయుడు

ప్రజాసంఘాల ఐక్యత అనివార్యం

పెన్షనర్ల జెఎసి ఛైర్మన్ పురుషోత్తం నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

హక్కుల కోసం ఉపాధ్యాయ, ఉద్యోగ, ప్రజాసంఘాలు చేస్తున్న ఉద్యమాలను అణచివేసేందుకు ప్రభుత్వాలు అనేక రకాలైన నిర్బంధాలను అమలు చేస్తున్నాయని, దీనివల్ల ప్రతిఘటించే సామర్థ్యాన్ని ప్రజలు కోల్పోతున్నారని ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల సంఘం ఛైర్మన్ చౌదరి పురుషోత్తం నాయుడు అన్నారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు రాసిన 'నా ప్రశ్నకు బదులేది' మినీ కవితా సంపుట పుస్తకావిష్కరణ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడచిన కాలంలో ఎన్ని నిర్బంధాలు ఎదురైనా హక్కుల సాధన కోసం సమిష్టిగా ఉద్యమాలు సాగేవని అన్నారు. పాలకులు సృష్టించిన అంతర్గత విభేదాల వల్ల హక్కులు సాధించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య ఉన్న చోటే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. సమిష్టి పోరాటాలు వల్లే ఒత్తిడి పెంచడానికి వీలువుతుందన్నారు. కార్యక్రమంలో అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ కృష్ణారావు పుస్తక సమీక్ష చేపట్టారు. ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం మాట్లాడుతూ ఉద్యోగుల, ఉపాధ్యాయ సంఘాల ఐక్యతను ప్రతిబింబించే విధంగా రచన సాగిందన్నారు. అరుణోదయ సాంస్కృతిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ వామపక్షాల ఐక్యత దేశంలోని సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పప్పల రాజశేఖర్, బమ్మిడి శ్రీరామ్మూర్తి, వి.సత్యనారాయణ, కూన రంగనాయకులు, శీర రమేష్, బలివాడ ధనుంజయరావు, బోనెల రమేష్, కనిమెట్ట పద్మావతి, గురుగుబెల్లి భాస్కరరావు, దుప్పల శివరాంప్రసాద్, వల్లభ మల్లయ్య, గొంటి గిరిధర్, బి.మోహనరావు, తంగి మురళి, ఎస్.కిషోర్, పి.అప్పారావు, వై.తులసీదాస్, నల్ల హడ్డి, ప్రజాసంఘాల నాయకులు పి.దానేసు, జోగి కోదండరావు, బీన ఢిల్లీరావు, కొమ్ము అప్పలరాజు, పూజారి హరిప్రసన్న పాల్గొన్నారు.

పిఆర్ ఇంజినీర్ల ఖాళీలను భర్తీ చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో ఉన్న ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.వి.మురళీకృష్ణ నాయుడు డిమాండ్ చేశారు. నగరంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా అధ్యక్షులు సనపల రామకృష్ణ అధ్యక్షతన రాష్ట్రస్థాయి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014-19 సంవత్సరాల మధ్య పెండింగ్‌లో ఉన్న పిఆర్ పరిధిలోని ఇంజినీర్లపై గతంలో పెట్టిన కేసులు రద్దు చేయాలన్నారు. 2014-19 మధ్యలో టిడిపి అధికారంలో ఉండగా రాష్ట్రవ్యాప్తంగా 25 వేల కిలోమీటర్ల పొడవున పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం రోడ్లు వేశారని, దేశానికి ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానం సంపాదించిందని గుర్తుచేశారు. గ్రామీణాభివృద్ధిలో పిఆర్ ఇంజినీర్ల పాత్ర అమోఘమని కొనియాడారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లెపండగ పేరుతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున రహదారులు నిర్మాణానికి శ్రీకారం చుట్టగా, వాటిని సకాలంలో పూర్తి చేసి ప్రభుత్వానికి మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చిన ఘనత పిఆర్ ఇంజినీర్లదేనని అన్నారు.

మూడు దశాబ్దాలుగా రిక్రూట్మెంట్ లేక చాలీచాలని సిబ్బందితో పనులు చేస్తున్నామని అన్నారు. వెంటనే ఎపిసర్వీస్ కమిషన్ ద్వారా అసిస్టెంట్ ఇంజినీర్ల రిక్రూట్మెంట్ చేపట్టాలని కోరారు. రాజకీయ కోణంలో 2019-24 మధ్యలో అప్పటి ప్రభుత్వం రాష్ట్రంలో అనేక మందిపై తప్పుడు కేసులు బనాయించిందని, వీటిని వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కె.సంగీతరావు, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మురళీకృష్ణ నాయుడు



తల్లీకుమార్తెల మృతదేహాలు

తల్లీకుమార్తె ఆత్మహత్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని గూడెం గ్రామ సమీపంలోని పంట పొలాల మధ్య ఉన్న నేల బావిలో దూకి తల్లీకూతుళ్లు ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... చాలా ఏళ్ల క్రితం భిలాయ్ నుంచి గూడెంలో సావిత్రి (56) తన కుమార్తె వరలక్ష్మి (28)తో ఉండేవారు. వరలక్ష్మికి విజయనగరం జిల్లా డెంకాడకు చెందిన కర్రి శ్రీనివాసరావుతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి పూర్ణ చంద్రిక (13) కుమార్తె ఉంది. చంద్రిక 20 రోజుల అనారోగ్యానికి గురైంది. దీంతో డెంకాడ చర్చిలో పాస్టర్‌తో పలు ప్రార్థనలు చేయించిందని పోలీసులు తెలిపారు. అక్కడ నుంచి విశాఖపట్నం సిటీ జ్ఞానాపురంలోని చర్చికి తీసుకెళ్లారన్నారు. అక్కడ ప్రార్థనలకు పూర్ణచంద్రిక ఏడవడంతో తల్లి, అమ్మమ్మ నోట్లో గుడ్డలు కుక్కరు. దీంతో పూర్ణచంద్రికకు ఊపిరాడక మృతి చెందిందని తెలిపారు. దీంతో పూర్ణచంద్రికను తల్లి, అమ్మమ్మ చంపేశారని మృతురాలి తండ్రి డెంకాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వారిరువులపైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. విషయం తెలుసుకున్న సావిత్రి, వరలక్ష్మి అక్కడ నుంచి పారిపోయి గూడెం చేరుకున్నారు. భయంతో ఏం చేయాలో అర్థం కాక తల్లీకూతుర్లు ఇద్దరూ మెడలకు చున్ని కట్టుకొని గ్రామ సమీపంలో ఉన్న నేలబావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనను దూరం నుంచి చూసిన స్థానికులు పరుగున వెళ్లాడు. ఈతగాళ్లు నూతిలోకి దిగి వారిని బయటకు తీసి చూడగా అప్పటికే మృతి చెందారు. వెంటనే శ్రీకాకుళం రూరల్ పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. మృతురాలి సావిత్రి భర్త మల్లేశ్వరరావు గతంలో మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రతి విద్యార్థీ చదువుతో పాటు నైపుణ్యాన్ని పెంచుకుని లక్ష్య సాధనకు చిత్తశుద్ధితో శ్రమపడితే విజయాలను అందుకోగలరని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి ప్రతి నియోజకవర్గంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. వీటి ద్వారా వేలాది మందికి ఉపాధి లభిస్తోందన్నారు. రానున్న రోజుల్లో జిల్లాలో స్కిల్ డవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు పర్యవేక్షణలో నిర్వహించి జాబ్‌మేళాలో 20 ప్రయివేటు కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని వివిధ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 2789 మంది దరఖాస్తు చేసుకోగా, 1022 మందిని వివిధ ఉద్యోగాల్లో నియమిస్తూ నియామకపు పత్రాలను అందజేశారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయికుమార్ మాట్లాడుతూ జాబ్‌మేళాలో నిరుద్యోగ యువతీ యువకులకు మంచి అవకాశం దక్కుతోందన్నారు. ఈ జాబ్‌మేళాలో జిల్లా తెలుగు యువత అధ్యక్షులు దాసునాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు మాధవరపు వెంకటేష్, పార్టీ నాయకులు ఎస్.వి.రమణ మాదిగ, ఉంగటి రమణమూర్తి, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

జిల్లా ఖ్యాతిని చాటి చెప్పిన జ్యోషిత

మందస: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో కంచరాన జ్యోషిత 597 మార్కులు సాధించి జిల్లా ఖ్యాతిని చాటి చెప్పిందని డిఇఒ తిరుమల చైతన్య అన్నారు. మండలంలోని హరిపురంలోని జ్యోషిత స్వగృహానికి ఆదివారం వెళ్లి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జ్యోషిత తల్లిదండ్రులు లేపాక్షి, మాధవరావులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ పాఠశాలలో చదివిచండం వల్ల ప్రజల్లో ప్రభుత్వ విద్యపై నమ్మకాన్ని పెంచేవిధంగా ఉందని తెలిపారు. అనంతరం జ్యోషితకు రూ.పది వేలు నగదు, వ్యక్తిగత బహుమతిని అందజేశారు. ఉన్నత చదువులు చదవటానికి పూర్తి సహకారాన్ని అందజేస్తామని తల్లిదండ్రులకు భరోసానిచ్చారు. అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థుల్లో పి.కరిష్మా 955 మార్కులు సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులకు అభినందించారు. ఎంఇఒ ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ వరుసగా రెండేళ్ల నుంచి మందస మండలానికి పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు రావడం మండల ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.చక్రధరరావు, ఎల్.సాంబమూర్తి, జి.కోదండరావు, కె.రమేష్, జి.రమేష్, బి.కృష్ణారావు, సంతోష్‌కుమార్ పండ, ఎస్.రేణుక, ఎస్.స్వప్న, డి.ఈశ్వరరావు పాల్గొన్నారు.



జ్యోషితను అభినందిస్తున్న డిఇఒ తిరుమల చైతన్య

చందనోత్సవానికి ప్రత్యేక బస్సులు

శ్రీకాకుళం: సింహాచలం నృసింహస్వామి ఆలయంలో ఈనెల 30న నిర్వహించనున్న చందనోత్సవానికి జిల్లా నుంచి యాత్రికులు వెళ్లేందుకు శ్రీకాకుళం బస్‌స్టేషన్ కాంప్లెక్స్ నుంచి ప్రత్యేక ఆర్‌టిసి బస్సులు నడుపుతున్నట్టు జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం వివిధ డిపోల అధికారులతో ఆర్‌టిసి భవన్‌లో గల ఆయన ఛాంబరులో సమావేశమయ్యారు. ఆర్‌టిసి ఆధ్వర్యాన యాత్రకు నడుపుతున్న ప్రత్యేక బస్సులను సాధారణ ఛార్జీలతోనే ప్రయాణించేందుకు వీలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా శ్రీకాకుళం బస్ స్టేషన్ నుంచి రణస్థలం, నాతవలస, విజయనగరం, పద్మనాభం, శొంట్యాం మీదుగా అడవివరం, రూట్‌లోను రణస్థలం, తగరపువలస, ఆనందపురం, సొంట్యాం మీదుగా అడవివరం వరకు మరో రూట్‌లో ప్రత్యేక బస్సులను నడుపుతామన్నారు. అడివివరం గోశాల నుంచి కొండపైకి 13 సిటీ బస్సులు నడుపుతున్నట్టు వివరించారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు వీలుగా సౌకర్యాలను కల్పిస్తున్నట్టు తెలిపారు. డిపో మేనేజర్లు, ట్రిఫిక్, మెకానికల్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

లోవోల్టేజీని అధిగమిస్తాం

- అవసరాలకు తగ్గట్టు ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి
- వ్యవసాయానికి నిరంతరాయంగా 9 గంటల విద్యుత్ సరఫరా
- ఇపిడిసిఎల్ ఎస్ఇ కృష్ణమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

వేసవిలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, లోవోల్టేజీ సమస్య తలెత్తకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని ఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎన్.కృష్ణమూర్తి అన్నారు. జిల్లావ్యాప్తంగా 8.43 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, వినియోగదారులకు ఎప్పటికప్పుడు సంస్థ ద్వారా మరింత మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. ప్రధానంగా లోవోల్టేజి సమస్యపై దృష్టి పెట్టామన్నారు. అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లను మారుస్తున్నామని వివరించారు. జిల్లాలో రోజూ 4.8 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఉందని, ప్రస్తుత అవసరాలకు తగ్గట్టు జిల్లాకు అవసరమవుతున్న 237 మెగావాట్లు అందుబాటులో ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. అధిక లోడ్ రాకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తున్నామన్నారు. గృహ అవసరాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, వ్యవసాయానికి 9 గంటల నిరంతర విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో రిలీఫ్ ఉంటుందని, దీనివల్ల వినియోగదారులకు ఇబ్బంది ఉండదని ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కు వివరించారు.

? సేవలు మెరుగుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వాడకం ఏటా పెరుగుతోంది. వినియోగ దారుల సంఖ్య పెరుగుతోంది. పెరుగుతున్న అవసరాలకు అనుణంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతోంది. జిల్లాలో రోజూ సుమారు 48 లక్షల యూనిట్లు విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. అందుకు అవసరమైన 237 మెగావాట్లు విద్యుత్ జిల్లాకు సరఫరా అవుతోంది. వేసవిలో వినియోగం కొంత మేరకు పెరుగుతోంది. పెరుగుతున్న అవసరాలతో పాటు కొత్తగా విద్యుత్ కనెక్షన్లు పెరుగుతుండడంతో అందుకు తగ్గట్టుగా వినియోగదారుల సేవలను విస్తృత పరచడానికి చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో ప్రస్తుతం 8.43 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో గృహ అవసరాలకు 7,19,574 కనెక్షన్లు ఉండగా, 30 వేలు వ్యవసాయ పంపుసెట్లు, వాణిజ్య అవసరాలకు 70 వేలు, పరిశ్రమలకు 2,500 కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ అవసరాలకు 21 వేల కనెక్షన్లు ఉన్నాయి.





? జిల్లాలో ఎలాంటి మార్పులు తీసుకొస్తున్నారు?

జిల్లాలో విద్యుత్ సరఫరా నాణ్యతను పెంచడానికి వీలుగా రివాంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టారు స్కీం (ఆర్‌డిఎస్ఎస్) పథకం నిధులతో జిల్లాలో సముద్రతీరం వెంబడి తుప్పుపట్టిన కండక్టరును 25 కిలో మీటర్ల మార్చేందుకు యాజమాన్యం అనుమతించింది. వీటితో పాటు వ్యవసాయ ఫీడర్లు, ఓవర్‌లోడ్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫోల్స్ మార్పిడి జరుగుతోంది. నెట్‌వర్కు ప్రక్షాళన చేపట్టాం. ఇప్పటికే 42 వ్యవసాయ ఫీడర్లు, 12 ఓవరు లోడ్ ట్రాన్స్‌ఫార్మర్లు, 1945 ఫోల్స్ మార్పిడి పూర్తయింది. 2025 చివరినాటికి ఈ పనులన్నింటినీ పూర్తి చేయాల్సి ఉంది.

? వేసవిలో యాక్షన్ ప్లాన్ ఎలా ఉండబోతోంది?

వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ వినియోగాన్ని అంచనా వేసి తదనుగుణంగా మార్పులు చేస్తున్నాం. గతంలో పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఎసిలు గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతోంది. దీనివల్ల విద్యుత్ అవసరాలు పెరుగుతున్నాయి. పెరుగుతున్న అవసరాలకు తగ్గట్టు జిల్లాలో రూ.10 కోట్ల వ్యయంతో ఏడు పెద్ద పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చారు. ప్రస్తుతం ఉన్న సబ్‌స్టేషన్ల పరిధిలో గార మండలం చల్లపేట, పిసిని, లోలుగు, వీరఘట్టం, జి.సిగడాం, పిన్నింటిపేట, మబుగాం, జి.సిగడాంలలో వీటిని అమర్చాం. రూ.20 కోట్లతో వేసవి యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపించాం.

? టోల్‌ఫ్రీ సేవలు ఎలా సాగుతున్నాయి?

టోల్‌ఫ్రీ నంబరుపై విస్తృత ప్రచారం చేపడుతున్నాం. వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ సమస్య తలెత్తినా 1912 టోల్ ఫ్రీ నంబరును నేరుగా ఫోన్‌లో ఫిర్యాదు చేసుకోవచ్చు. ఫిర్యాదు చేసిన గంట వ్యవధిలో సిబ్బంది తమ సేవలను అందిస్తారు. ఈ నంబరుకు ఫోన్ చేసిన వెంటనే రౌండ్‌దిక్లాక్ సేవలు నిరంతరాయంగా అందిస్తున్నాం. ఈ సౌకర్యాన్ని వినియోగాదారులు వినియోగించుకోవాలి. సిబ్బంది సకాలంలో సేవలందించక పోతే చర్యలు తీసుకుంటాం.



తాబేళ్లను సముద్రంలోకి విడిచిపెడుతున్న జెసి కుటుంబ సభ్యులు


ఆలివ్‌రిడ్లే తాబేళ్లతో పర్యావరణ సమతుల్యత

ప్రజాశక్తి- నౌపడ

ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణ వల్ల పర్యావరణ సమతుల్యతకు ఉపయోగపడుతుందని జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. సంతబొమ్మాళి మండలం భావనపాడులో ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సంరక్షణ కేంద్రంలోని 420 తాబేలు పిల్లలను కుటుంబ సభ్యులతో కలిసి సముద్రంలోకి విడిచిపెట్టారు. సముద్ర జలాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలు తినడం ద్వారా పర్యావరణానికి, మత్స్యకారులకు తాబేళ్లు మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో భావనపాడు సర్పంచ్ బి.మోహన్‌రెడ్డి, ట్రీ ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ సోమేశ్వరరావు, సెక్షన్ ఆఫీసర్ నరేంద్ర, ఫారెస్టు బీట్ ఆఫీసర్ జయలక్ష్మి, మూలపేట సర్పంచ్ బాబూరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారికి ఎంత కష్టమొచ్చింది

దాతల సాయం కోసం ఎదురుచూపులు



హేమంత్ చెవి వద్ద కణితి

పలాస: మండలంలోని రెంటికోటకు చెందిన మంత్రా సురేష్, యోగేశ్వరి దంపతులకు ఐదేళ్ల హేమంత్ కాశీబుగ్గలో నివాసముంటున్నారు. తాతయ్య నాగేశ్వర ఇంటి వద్ద ఉంటూ హేమంత్ భాష్యం స్కూల్‌లో ఎల్‌కెజి చదువుతున్నాడు. ఎంతో చురుకుగా ఉన్న చిన్నారి హేమంత్‌కు కుడి చెవి క్రింది భాగంలో కణితి ఏర్పడింది. పలాస-కాశీబుగ్గలోని అనేక ఆస్పత్రులు, శ్రీకాకుళం, విశాఖ, హైదరాబాద్ ఆస్పత్రులకు తిప్పారు. ఎక్కడా నయం కాలేదు. కణితి వాపు రోజురోజుకూ పెద్దదై వస్తుంది. దీనిని తొలగించేందుకు తల్లిదండ్రుల వద్ద డబ్బులు లేకపోవడంతో దాతల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే అప్పులు చేసి తమిళనాడు రాష్ట్రం వెల్లూరు ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించి చికిత్స అందిస్తున్నారు. ఈ కణితిని ఆపరేషన్ ద్వారా తొలగించేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలవడంతో నిరుపేదలైన తాతయ్య నాగేశ్వరతో పాటు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి తమ చిన్నారిని ఆదుకోవాలని కోరారు. దాతలు 7416869890ను సంప్రదించాలని కోరుతున్నారు.

జర్నలిజం వృత్తి కాదు బాధ్యత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం: సమాజంలోని రుగ్మతలను తొలగించడంలో అత్యంత కీలకపాత్ర పోషిస్తున్న జర్నలిజం వృత్తిగా కాకుండా సామాజిక బాధ్యతగా పరిగణించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని రెవెన్యూ అతిథి గృహంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ జిల్లా మహాసభలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అనేక రకాలైన రుగ్మతలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయని, వీటిపై సమగ్రమైన కథనాలను వెలికి తీయాలన్నారు. తద్వారా ప్రజలకు మేలు జరగాలన్నారు. జర్నలిస్టులకు ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఢిల్లీబాబు రెడ్డి, నాయకులు సిహెచ్ శ్రీనివాస్, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, జిల్లా నాయకులు డోల అప్పన్న, ప్రవీణ్ తిత్తి, నాగభూషణం, టెంక శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

గానామృతానికి ఇచ్ఛాపురం కళాకారులు



ఇచ్ఛాపురం కళాకారులు

ఇచ్ఛాపురం: ఈ నెల 29న తిరుమల తిరుపతి దేవస్థానంలో వెంకటేశ్వర గానామృతం ఇచ్ఛాపురం కళాకారులకు మరోసారి అవకాశం వచ్చింది. తిరుపతి దేవస్థానం స్వామి అఖండ హరినామ సంకీర్తన నిర్వహించ నున్నారు. ఇచ్ఛాపురం కళాకారులు వెంకటేశ్వర భక్తి రంజని బృందం చిన్నా గురుస్వామి ఆధ్వర్యాన జయలక్ష్మి పట్నాయక్, కుమారి హైమ, గుణదేవా, యజ్ఞానంద్, శరణ్యశ్రీ, దీక్షిత, కీబోర్డుపై హేమంత్ కుమార్ బాడిత్య తబలా సహకారం నిత్యానంద్ బాడీత్య పాల్గొంటున్నారు. సంవత్సరానికి రెండుసార్లు తమకు అవకాశం కల్పిస్తున్న టిటిడికి కళాబృందం ధన్యవాదాలు తెలిపింది.

పవర్ బోర్ నిర్మాణానికి శంకుస్థాపన

పలాస : పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం 26వ వార్డు గొల్లవీధిలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉందని కమిషనర్ ఎన్.రామారావు ఆధ్వర్యాన కౌన్సిలర్ తంగుడు ఆశాలత పవర్ బోరు నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. పవర్ పూర్ ఈ ప్రాంతానికి ఎంతో అవసరమని కౌన్సిలర్ పలుమార్లు సమావేశంలో కోరారు. ఈ మేరకు గతేడాది పవర్ బోరు నిర్మాణానికి నిధులు మంజూరైనా నిర్మాణానికి నోచుకోలేదు. దీనిపై కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పవర్ బోర్డు నిర్మాణానికి సిద్ధమైంది. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రతినిధి తంగుడు హరీశంకర్, మల్లా ప్రకాశరావు, శానిటరీ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కుమార్, వెంకటేష్, శానిటరీ సూపర్‌వైజర్లు సోమేశ్వరరావు, మోహన్ పాల్గొన్నారు.

మత్స్యకార భరోసాలో వివక్ష

కవిటి: అర్హులైన ప్రతి మత్స్యకారుడికి భరోసా అందిస్తామని చెప్పి తీరా పథకం అమలు చేసినపవిడు కొంతమంది పేర్లు తప్పించి కూటమి నాయకులు వివక్ష చూపించారని మండలంలోని కపాసుకుద్ది గ్రామస్తులు ఆరోపించారు. ఆదివారం గ్రామాన్ని సందర్శించిన జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్‌కు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ గ్రామంలో సుమారు 59 మందికి మత్స్యకార భరోసా అందకుండా చేశారని వారు ఫిర్యాదు చేశారు. దీనిపై సంబంధిత అధికారులను కలిసినా ఫలితం లేకపోయిందని వాపోయారు. ఏ ఆసరా లేని తమకు అండగా నిలిచి న్యాయం చేయాలని కోరారు. సర్పంచ్ దమయంతి, కాయ భీమసేన్, శ్రీరాములు, అశోక్ పాల్గొన్నారు.

ప్రయోగం ఫలించి.. పంట పండింది

- నూతన వంగడంతో మంచి దిగుబడి
- రెండో పంటకు అనువైన రకం
- మాస్టారు శ్రమకు దక్కిన ఫలితం

ప్రజాశక్తి- కవిటి

వ్యవసాయానికి ఆధునికత జోడిస్తూ ముందుకు సాగుతున్న కవిటి మండలం బొరివంక గ్రామానికి చెందిన రైతు నేస్తం బల్లెడ శాంతమూర్తి మాస్టారు రబీలో ప్రయోగాత్మకంగా వేసిన ఎన్‌ఎల్‌ఆర్ 3648(మినీ కిట్) రకానికి చెందిన వంగడం మంచి ఫలితాన్ని ఇచ్చింది. శ్రీకాకుళం కృషి విజ్ఞాన కేంద్రం నుంచి ఎన్‌ఎల్‌ఆర్ 3648 మినీ కిట్ తెప్పించిన మాస్టారు 25 సెంట్లలో ప్రయోగాత్మకంగా వేశారు. ప్రస్తుతం అది కోతదశకు చేరుకోవడం, ఆ వెన్నులు తలవంచి చిరుగాలులకు సవ్వడి చేస్తుండడంతో ఈ సోయగాల పంట చూపరులకు కనువిందు చేస్తోంది. బిపిటి 5204 రకానికి సిఆర్ 1864-9-10-5-63 రకంతో



కనువిందు చేస్తున్న ఎన్‌ఎల్‌ఆర్ 3648 పంట

సంయోగం చేసి ఎన్‌ఎల్‌ఆర్ 3648 వంగడాన్ని శాస్త్రవేత్తలు తయారు చేశారు. అందులో భాగంగా మండలంలో ఇద్దరు రైతులు ప్రయోగాత్మకంగా వీటిని తెప్పించి తమ వ్యవసాయ క్షేత్రంలో పరిశీలించారు. 120 నుంచి 125 రోజుల కాల పరిమితి గల ఈ పంట హెక్టారుకు 7 టన్నుల వరకు దిగుబడి ఇస్తుందని శాస్త్ర వేత్తలు తెలిపారు. అంతేకాకుండా తెగుళ్లను తట్టుకునే శక్తి ఉన్న ఈ పంట రబీ కాలానికి అనువైనదని శాస్త్రవేత్తలు తేల్చారు.

పురుగు మందులు వాడలేదు



ఎన్.ఎల్.ఆర్ 3648 ప్రయోగాత్మకంగా 25 సెంట్లలో వేశాను. పంట చాలా బాగుంది. పురుగు మందులు పూర్తిగా వాడలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో కొద్ది మోతాదులో ఎరువులు వాడడం జరిగింది. పంట ప్రారంభంలో పీక పురుగు ఆశించినా పెద్దగా ఇబ్బంది పెట్టలేదు. దాన్ని తట్టుకొని ఎన్‌ఎల్‌ఆర్ నిలబడింది. శాస్త్రవేత్తలు చెప్పిన విధంగానే తెగుళ్లను తట్టుకుంది. దిగుబడి కూడా బాగానే ఉంటుందని ఆశిస్తున్నాను. 25 సెంట్లకు పది బస్తాల వరకు దిగుబడి వస్తుందని అనుకుంటున్నాను. అధికారుల సూచన మేరకు ఈ ఏడాది ఎన్‌ఎల్‌ఆర్ 3648 విత్తనాలు తయారు చేస్తున్నాను. అవసరమైన రైతులు సంప్రదిస్తే (9701569474) వారికి అందిస్తాను.

- బల్లెడ శాంతమూర్తి, రైతు, బొరివంక

రెండో పంటకు అనుకూలం



ఎన్‌ఎల్‌ఆర్ 3648 నెల్లూరు రకానికి చెందిన ఈ వంగడం రెండో పంటకు అనుకూలమైనది. మిగతా పంటలతో పోల్చుకుంటే దీనికి సస్యరక్షణ చర్యలు తక్కువ. దిగుబడి కూడా చాలా బాగుంటుంది. ఈ ఏడాది కవిటి మండలంలో ఇద్దరు రైతులకు ప్రయోగాత్మకంగా మినీ కిట్ రూపంలో అందించాం. ఆ ప్రయోగం విజయవంతం కావడం సంతోషం. భవిష్యత్‌లో మరింత మంది రైతులు ఎన్‌ఎల్‌ఆర్ 3648 పంట సాగు చేస్తారని ఆశిస్తున్నాం.

- భవానీ శంకర్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, శ్రీకాకుళం

అరసవల్లి సందర్శన

అరసవల్లి: ప్రత్యక్షదైవం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని ఆదివారం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ వెంకట కృష్ణారావు దంపతులు స్వామిని సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ కార్యనిర్వాహనాధికారి యర్రం శెట్టి భద్రాజీ స్వాగతం పలికి వేద మంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం అనివేటి మండలంలో స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

తమ్మినేనికి అభినందనలు

ఆమదాలవలస: మాజీ స్పీకర్, వైసిపి పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాంను ఆయన స్వగృహంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల వైసిపి పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియమించినందున తమ్మినేనిని కలిసి అభినందించి దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు వైస్ ఎంపిపి ప్రతినిధి ఎం.వెంకటరమణ, సర్పంచ్ సురేష్, వైసిపి నాయకులు గొంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నరేంద్ర యాదవ్ జన్మదినం

ఇచ్ఛాపురం : వైసిపి నాయకులు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెమ్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం అభిమానుల కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ప్రతినిధి ఉప్పాడ రాజారెడ్డి, కడియాల ప్రకాష్, డాక్టర్ ఉలాలా శేషుయాదవ్, సెల్లా దేవరాజు, కె.మోహనరావు, నర్తు వరప్రసాద్, నర్తు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటస్థలం నిర్మాణానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సూర్య

రణస్థలం: మండలంలోని కొట పాలేం పంచాయతీలో విద్యార్థులు, యువకులు ఆటలు ఆడుకునేందుకు ఆటస్థలం నిర్మాణానికి జనసేన నాయకులు గొర్లె సూర్య రూ.15 వేలు ఆర్థికసాయాన్ని ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువతీ, యువకులు క్రీడలతో పాటు చదువుపై కుడా పూర్తిస్థాయిలో దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో మోహన్, వినయ్, అప్పన్న, సన్యాసి, గౌరీనాయుడు, గొర్లె ఆసిరినాయుడు పాల్గొన్నారు.

పెద్దమార్కెట్‌లో అన్నదానం

అరసవల్లి: నగరంలోని పెద్దమార్కెట్ వద్ద శ్రీరామనవమి సందర్భంగా వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో వర్తక సంఘం ప్రెసిడెంట్ కోరాడ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

కవిటి: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కంచి కామాక్షి అగ్నికుల క్షత్రియ సంఘం ప్రోత్సాహకాలు అందించింది. ఈ మేరకు జగతిలో విద్యార్థులు పులకల కౌశిక్, పి.కుసుమ లత, పి.శ్రీరామ్‌కు ఆదివారం నగదు, మెమోంటోలు బహుకరించి దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ఆర్థిక సాయం చేసిన పులకల మాధవరావు మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహం అవసరమని, ఆ ప్రోత్సాహం వారి భవిష్యత్తుకు బాటలు వేస్తుందని అన్నారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ సంఘం సభ్యులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

శ్రీకాకుళం రూరల్: మండలం కరజాడ గ్రామానికి చెందిన జామి జయలక్ష్మి ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆమెతో పాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణా శిబిరాలు

ప్రజాశక్తి- లావేరు

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నామని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు తెలిపారు. కథలు, కథనాలు సృజనాత్మక కృత్యాలు, కథలు చెప్పడం, చదవడం మాకిష్టం, స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు వేసవి శిక్షణా తరగతులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆయన కోరారు. రోజుకొక రిసోర్స్ పర్సన్‌తో శిక్షణ ఇప్పిస్తామని, ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయని ఆయన తెలిపారు.

బూర్జ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి కె.సునీత తెలిపారు. పాఠశాలలకు సెలవులు ప్రారంభం కావడంతో విద్యార్థుల్లో ఉన్న అంతర్గత ప్రతిభను వెలికి తీసేందుకు ఈ శిబిరాలు ఎంతగానో దోహద పడతాయని ఆమె అన్నారు.

కొత్తూరు : స్థానిక శాఖాగ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6 వరకు శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నామని గ్రంథాలయాధికారి టి.ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు కథలు వినుట, పుస్తక పఠనం, సమీక్షలు పేద్దల నుంచి విన్న ఆముద్రిక కథలు చెప్పడం, చిత్రలేఖనం, పేపర్ చదివించడం, ఆర్ట్స్, స్పోర్ట్స్, గేమ్స్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

టెక్కలి : వేసవి సెలవుల్లో భాగంగా సోమవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించనున్నామని గ్రంథాలయాధికారి బి.రూపావతి తెలిపారు. ఈ మేరకు ఎంఇఒ దాసుపురం చిన్నారావుకు ఆదివారం లేఖ అందించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు నిర్వహించనున్నామని తెలిపారు. వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులకు కథలు వినిపించడం, పుస్తక సమీక్షలు, చిత్రలేఖనం వంటి సృజనాత్మక పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు.



ఆమదాలవలస : కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఉగ్రవాదాన్ని అరికట్టాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఉగ్రవాదాన్ని అరికట్టి మతోన్మాదం నుంచి అమాయక ప్రజల ప్రాణాల్ని కాపాడాలని శ్రీనివాసాచార్యుల పేట సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి అన్నారు. ఆదివారం గ్రామ పురవీధుల్లో పహల్గాంలో మృతి చెందిన పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉగ్రవాదులు ఉన్మాదులుగా వ్యవహరించి అమాయక ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకోవడం హేయమైన చర్య అన్నారు. ఇటువంటి దుశ్చర్యలను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: జమ్మూ-కాశ్మీర్ పెహల్గామ్‌లో ఇటీవల పర్యాటకులపై ఉగ్ర మూకల దాడి హేయమైన చర్య అని జనసేన క్లస్టర్ ఇన్‌ఛార్జ్, మాజీ సైనికుడు దువ్వాడ వంశీకృష్ణచౌదరి అన్నారు. మండలంలోని గుల్లలపాడులో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పర్యాటకులను మతం పేరుతో దారుణంగా హింసించి చంపడం హేయమైన చర్య అన్నారు. ఇది వ్యక్తులపై దాడి కాదు భారతీయత పై దాడి అన్నారు. దేశంలో మత బేధాలను సృష్టించాలని చూస్తున్న ముష్కరులకు దేశమంతా ఒక్కటే అని సంకేతం ఇవ్వాలని కోరారు. ఉగ్ర మూకల దాడిలో అసువులు బాసిన కుటుంబాలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.

కోటబొమ్మాళి: జూమ్ము-కాశ్మీర్ పహల్గామ్ ప్రాంతంలో ఇటీవల జరిగిన ఉగ్రదాడి దారుణమని కోటబొమ్మాళి సర్పంచ్ కాళ్ల సంజీవరావు అన్నారు. ద్యోగులు, విద్యార్థులు, వర్తకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఉగ్రదాడికి నిరసిస్తూ శాంతియుతంగా ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల అమాయకుల ప్రాణాలు తీయడం అనేది పిరికి పంద చర్యయని, ఇటువంటి దుష్ట చర్యలను ప్రజలు ఐక్యతతో గట్టిగ సమాధానం చెబుతారని, ఇటువంటి ఘటనలు చాలా బాధాకరమని అన్నారు.

టెక్కలి : పహల్గామ్‌లో ఉగ్రవాద దాడిని ప్రతిఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని ప్రజా చైతన్య కళా సమితి, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యాన టెక్కలిలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కళాసమితి నిర్వాహకులు దూసి ఆంధ్రాస్టాలిన్, ఉత్తరకవాటం గణపతి, చిలుక కృష్ణారావు, మూల తాతయ్య, బొడ్డ అయ్యబాబు, రాంజీ, నరేంద్ర పాల్గొన్నారు.

పాత్రికేయ రంగానికే గుర్తింపు

ప్రజాశక్తి- కవిటి

ఉభయ తెలుగు రాష్ట్రాల ఉత్తమ జర్నలిస్టుగా కవిటి ప్రజాశక్తి విలేకరి పూడి సత్యనారాయణ సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ చేతులు మీదుగా అవార్డు అందుకోవడం పాత్రికేయ రంగానికే గుర్తింపని జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు పొందల కృష్ణారావు, సీనియర్ వ్యవసాయ అధికారి బొర్ర నరసింహమూర్తి అన్నారు. బెజ్జిపుట్టుగలో చక్ర పెరుమాళ్ స్వామి సన్నిధిలో శనివారం రాత్రి సత్యనారాయణకు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలువలతో కూడిన పాత్రికేయులకు సమాజంలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, సత్యనారాయణ భవిష్యత్‌లో మరిన్ని విశ్లేషణాత్మక కథనాలు రాస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొండ్యాల రామమూర్తి, బార్ల జగన్నాథం, పొందల శ్రీరామ్‌బాబు, బార్ల ధనుంజయం, బొడ్డ మోహనరావు, పొందల నారాయణమూర్తి, బార్ల లోకనాథం, పిరియా బాబ్జీ, పొందల ధనుంజయం, పొందల ప్రసాదరావు, బాలక సత్యనారాయణ స్వామి, గార రాజు స్వామి, బాలక రాజేష్ స్వామి, బెందాళం రామారావు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న బెజ్జిపుట్టుగ గ్రామస్తులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహాలక్ష్మి తదితరులు

మేడేను విజయవంతం చేయాలి


ప్రజాశక్తి- శ్రీకాకుళం

మే 1న ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి పిలుపునిచ్చారు. సిఐటియు మండల కన్వీనర్ జల్లు కాంచన అధ్యక్షతన గార సిఐటియు మండల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మాట్లాడుతూ ధరల పెరుగుదల, అవసరాలు దృష్టిలో పెట్టుకొని కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలన్నారు. కనీస పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులను, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, విఒఎ, స్కూల్ స్వీపర్లను రెగ్యులర్ చేయాలన్నారు. బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాలు కోసం 4 లేబర్ కోడ్‌లుగా మార్చి వేసిందన్నారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి యాజమాన్యాల శ్రమదోపిడీని మరింత పెంచుకోవడానికి, యజమానుల దోపిడీని, అక్రమ తొలగింపులను, పనిభారాన్ని ప్రశ్నించే పరిస్థితి లేకుండా చేయడం కోసం, పని గంటలు పెంచడానికి లేబర్ కోడ్‌లు తెచ్చారని అన్నారు. పెట్టుబడిదారులకు ఉద్యోగులను, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేవిధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతూ కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తుందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం ప్రజల త్యాగాలతో జాతి నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, పోర్టులు, రైల్వేలు, ఎల్‌ఐసి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులు దేశ ఆర్థిక సర్వస్వాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రయివేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ సామాన్యులపై భారాలు వేస్తుందన్నారు. సమాజంలో మత వైషమ్యాలు పెంచి మత చీలికలు తెస్తుందన్నారు. సమావేశంలో సిఐటియు గార మండల కమిటీ నాయకులు సుజాత, జగన్, దాలినాయుడు, అప్పన్నమ్మ, ఉదయం కుమారి, ధనలక్ష్మి అంగన్వాడీ, ఆశా తదితర యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గురువులకు ఘన సన్మానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణ శివారున ఉన్న టింపని హైస్కూల్‌లో 2008 - 2009 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అప్పటి హెచ్‌ఎం బొడ్డేపల్లి వెంకట నారాయణరావును దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ తన వద్ద విద్యాబుద్ధులు నేర్చుకున్న విద్యార్థులు తనను మర్చిపోకుండా గుర్తుపెట్టుకుని సన్మానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడి మంచి స్థాయిలో ఉండటం తమకు గర్వకారణమన్నారు. పూర్వ విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. అందరూ ఒకచోట చేరి ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు వెంకటరమణ, శ్రీనివాసరావు, రవికుమార్, జయరాం, విజయ్ గౌరీలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లోకేష్, వాసు, సావిత్రి, కమల, సంధ్య, సునీల్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

లక్ష్యాల సాధనతో సంతృప్తి



లక్ష్మీనారాయణ దంపతులు

ప్రజాశక్తి- బూర్జ

కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగం సంపాధించిన తనకు విధి నిర్వహణలో ప్రభుత్వ ఆదేశాల మేరకు లక్ష్యాలను శతశాతం సాధనతో సంతృప్తినిచ్చిందని బూర్జ గృహ నిర్మాణశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొరికాన లక్ష్మీనారాయణ తెలిపారు. ఈనెల 30న పదవీ విరమణ చేయనున్న ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. బూర్జ మండలం కురుంపేటలో తల్లిదండ్రులు కొరికాన దాలప్పల నాయుడు, ధనలక్ష్మిలకు రెండవ సంతానంగా 1965 ఏప్రిల్ 4న జన్మించారు.

విద్యాభ్యాసం..

బూర్జ మండలంలోని కురుంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1970 నుంచి 75 వరకు 1 నుంచి 5వ తరగతి వరకు చదువుకున్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు మండల కేంద్రంలోని బూర్జ ప్రభుత్వ హైస్కూల్లో చదువుకున్నారు. ఇంటర్మీడియట్ పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్నారు. డిప్లమో, సివిల్‌ను విశాఖపట్నంలోని ఓల్డ్ ఐటిలో చదువుకున్నారు.

ఉద్యోగ జీవితం...

1985లో విజయనగరం జిల్లా తెర్లంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. ఆరు నెలలు పని చేసి అనంతరం విజయనగరం జిల్లా పార్వతీపురంలో 94 వరకు వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశాను. 1995 నుంచి కంచిలి మండలంలో ఏడు సంవత్సరాలు పనిచేశాను. ఆమదాలవలస సబ్ డివిజన్ ఎల్‌ఎన్‌పేటలో ఐదు సంవత్సరాలు, అమదాలవలసలో మూడు సంవత్సరాలు పనిచేశాను. 2008లో గృహ నిర్మాణశాఖ ఎఇగా పదోన్నతిపై ఇచ్ఛాపురంలో ఏడేళు బాధ్యతలు నిర్వహించాను. జలుమూరులో ఒక ఏడాది, ప్రకాశం జిల్లాలో ఒక ఏడాది, శ్రీకాకుళంలో ఏడాది, సరుబుజ్జిలిలో ఐదేళ్లు, చివరిగా బూర్జ మండలంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందనున్నాను.

సంతృప్తి నిచ్చే అంశం...

వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా, ఎఇగా 40 ఏళ్లు పనిచేశాను. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను అనుసరిస్తూ మరోవైపు నిబద్ధతతో అర్హులైన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సేవలందించాను. ఈ ఉద్యోగ జీవితం నాకు ఎంతగానో సంతృప్తినిచ్చింది.

కుటుంబ నేపథ్యం...

1994లో వివాహమైంది. భార్య గిరిజా కుమారి గృహిణి, కుమారుడు అఖిల్ ఎస్‌బిఐలో ఉద్యోగం. కుమార్తె హరిణి ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



ఆనందరావు (ఫైల్)

కోటబొమ్మాళి: మండలంలోని యలమంచిలికు చెందిన బంధావు ఆనందరావు (35) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే... ఆనందరావు మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజుల క్రితం మద్యం తాగొద్దంటూ ఆనందరావు భార్య తేజావతి మందలించడంతో వీరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో కోపోద్రిక్తుడై పరుగుల మందు త్రాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటీనా స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఇక్కడి వైద్యులు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమార్తెలు నాగమణి, మీనా, కుమారుడు భవానీప్రసాద్‌లు ఉన్నారు.

గ్రానైట్ కార్మికుడు మృతి




కాళీరాయ్ మృతదేహం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని పెద్ద బమ్మిడి గ్రామ సమీ పంలో ఉన్న సాయిరాం గ్రానైట్ పరి శ్రమలో పనిచేస్తున్న కార్మికుడు అస్సాం రాష్ట్రం, బొంగైగోన్ జిల్లా, గురునానక్ నగర్‌కు చెందిన కాళీరాయ్ (34) పరిశ్రమకు సంబంధించిన రీసైక్లింగ్ నీటి కుండిలో పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... సాయిరాం గ్రానైట్ పరిశ్రమలో కాళీరాయ్ కార్మికునిగా పనిచేస్తున్నాడు. మృతుడు రెండు రోజులుగా పనికి రాకపోవడంతో తన స్వగ్రా మానికి వెళ్లి ఉంటాడని గ్రానైట్ యాజమాన్యం భావించింది. అయితే నిత్యం మద్యం సేవిస్తున్న రాయ్ ఆదివారం తెల్లవారే సరికి కంపెనీకి చెందిన పది అడుగుల లోతుగల రీసైక్లింగ్ నీటి కుండిలో శవమై తేలి ఉండడాన్ని తోటి కూలీలు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టు మార్టం నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలండ్‌లో కైజోల వాసి మృతి



దామోదర్ (ఫైల్)

ప్రజాశక్తి- పలాస

మండలంలోని కైజోలకి చెందిన బుడద దామోదర్(30) పోలండ్ దేశం వార్సాలో సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. దామోదర్ ఓ కంపెనీలో రెండున్నరేళ్లుగా వివిధ కంపెనీల్లో వెల్డింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్నాడు. దామోదర్ అదే రోజు రాత్రి 7.30 గంటల సమయంలో తన బార్య నీలవేణి, కుమారులు నికిల్, నితిన్‌తో చాలా సమయం వీడియో కాల్‌లో మాట్లాడారు. అంతలోనే మరో నాలుగు గంటల వ్యవధిలో తన భర్త మృతి చెందాడని కంపెనీ నుంచి నీలవేణి ఫోన్‌కు మెసేజ్ పెట్టి సమాచారం అందించారు. తన భర్త ఏలా మృతి చెందాడు? అక్కడ ఏమి జరిగింది? అప్పటి వరకు తనతో మాట్లాడిన వ్యక్తి అక్కడికి నాలుగు గంటల్లో మృతి చెందాడని సమాచారం రావడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీషకు కుటుంబ సభ్యులు వివరాలను అందించారు. రామ్మోహన్నాయుడు ద్వారా ఆ వివరాలను విదేశీరాయబారుల శాఖ ఆధ్వర్యాన సమాచారాన్ని పోలెండ్ రాయబార కార్యాలయానికి చేరవేసినట్లు సమాచారం. ఇప్పటికే సంఘటన జరిగి ఏడు రోజులు కావడంతో ఎప్పుడు మృతదేహం వస్తుందా? అని కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు.

వైసిపి నాయకుడు మృతి

టెక్కలి : మండలంలోని గోపీనాథపురానికి ఎంపిటిసి మాజీ సభ్యులు, వైసిపి నాయకులు దవళ కూర్మారావు ఆదివారం తన స్వగృహంలో మృతి చెందాడు. ఆయన మృతిపై నీటి సంఘ మాజీ అధ్యక్షులు సత్తారు వెంకటరమణ, ప్రాథమిక వ్యవసాయ సంఘం మాజీ చైర్మన్ సత్తారు సత్యం, ఎంపిటిసి మాజీ సభ్యులు సత్తారు ఉషారాణి, దవళ రంగబాబు, దవళ కుసుడు, బమ్మిడి గురివినాయుడులు కూర్మారావు భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

ఆటోను ఢీకొన్న కారు

కవిటి: మండలంలోని జమేదారుపుట్టుగ జాతీయ రహదారిపై ఆదివారం ఆగి ఉన్న ఆటోను వెనుక నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. అయితే ఈ సంఘటన జరిగిన సమయంలో ఆటోలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కారు డ్రైవర్ చిన్నచిన్న గాయాలతో బయటపడ్డాడు.

1న క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని తోటవాడ గ్రామంలో మే 1న కొత్తకోట హరీష్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు గ్రామ యూత్ సభ్యులు తెలిపారు. ప్రతి మ్యాచ్ పది ఓవర్లతో ఉంటుందని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనేవారు రూ.700 ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేయించు కోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9441936110, 8186913020 నంబర్లను సంప్రదించాలన్నారు.

సాహితీ సంబరాలకు ఆహ్వానం

రణస్థలం: జిల్లాకు చెందిన రచయిత్రి మోణంగి ప్రవీణకు మే 10, 11 తేదీల్లో జరగనున్నశ్రీశ్రీ కళా వేదిక ప్రపంచ సాహితీ సంబరాలకు హాజరు కావాలని ఆహ్వానం అందిందని ఆదివారం తెలిపారు. తెలుగు భాష, తెలుగు సాహిత్యం పరిరక్షణలో భాగంగా ఆమె ఎన్నో కవితలు, కథలు రాసారు. ఎందరికో స్ఫూర్తిగా నిలిచినందుకుగాను అంతర్జాతీయ శ్రీశ్రీ కళా వేదిక సిఇఒ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి నుంచి ఆహ్వానం అందినట్లు పేర్కొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ఇచ్ఛాపురం : మండలంలోని మండపల్లి శారద ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సంబవామి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన ఆదివారం నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. శ్రీకాకుళం శంకర్ నేత్ర ఫౌండేషన్ సౌజన్యంతో డాక్టర్లు అంజలి, శివప్రసాద్ నేత్రాలను పరీక్షించారు. అనంతరం 26 మందికి ఆపరేషన్ నిమిత్తం శంకర్ నేత్రాస్పత్రికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో చైర్మన్ కోట రామారావు, ప్రిన్సిపాల్ కోట తేజేశ్వరి, మేనేజర్ పూర్ణచంద్రరావు, సమన్వయకర్త టి.రామారావు, అనిల్‌సాహు, పాతిర్ల వల్లభరావు పాల్గొన్నారు.